బిల్డర్ అత్యుత్సాహం.. వృక్షాలు నేలమట్టం



చింతల్: ఓ బిల్డర్ అత్యుత్సాహం ప్రదర్శించి భారీ వృక్షాలను నేల మట్టం చేశాడు. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని స్టార్ హోమ్స్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో సుమారు 20 చెట్ల వరకు నేలమట్టం చేశారు. స్టార్ హోమ్స్ అపార్ట్‌మెంట్స్ కాలనీలో నూతన భవనాన్ని నిర్మిస్తున్న బిల్డర్ అడ్డు వస్తున్నాయన్న నెపంతో 15 సంవత్సరాల క్రితం నాటిన చెట్లపై వేటు వేశాడు. ఈ విషయమై స్టార్ హోమ్స్ ప్రతినిధులను అడుగగా.. ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ వాసులే విద్యుత్ తీగలకు కొమ్మలు అడ్డు వస్తున్నాయని ఫిర్యాదు చేయడంతోనే తొలగించామని పేర్కొనడం గమనార్హం. తొలగించిన 20 చెట్లను బుధవారం జీహెచ్ఎంసీ, ఫారెస్ట్ అధికారులు వచ్చి పరిశీలించారు. చెట్లు తొలగించిన యాజమాన్యంపై బిల్డర్ పై ఫారెస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే..

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి

సుభాష్‌నగర్: పేదల ఇళ్లను కూలగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. బుధవారం సాయిబాబానగర్ చౌరస్తాలో జిల్లా నాయకుడు దేవర రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 200 మందికి పైగా సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన పోయిందనుకుంటే అంతకన్నా దారుణంగా రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసు, గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అంగిడి మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, ఉపాధ్యక్షుడు విగ్నేష్, కార్యదర్శి గంధం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వనమాల, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బైండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

తిరుమల క్షేత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు




దుండిగల్: తిరుమలలోని కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దర్శించుకున్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, నాయకుల భాస్కర్ రెడ్డి, పోలీస్ గోవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరం



దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్ పర్సన్ సుంకరి కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళా సిబ్బంది బతుకమ్మను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆడారు. వేడుకల్లో కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ సునంద, మహిళా బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ నర్సింహా బస్తీకి చెందిన సన కౌసర్‌కు రూ.2.50 లక్షలు, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రసూన నగర్ ప్రాంత వాసి కె. అకిరకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. బుధవారం ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అందజేశారు.

గంటలోనే ఆచూకీని కనిపెట్టారు



జీడిమెట్ల: ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారిని ఒక గంట వ్యవధిలో జీడిమెట్ల పోలీసులు గుర్తించి బంధువులకు అప్పగించారు. సీఐ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. టీజీఐఐసీ కాలనీకి చెందిన షేక్ మూస కుమార్తె షేక్ మహీన్(08) అదే కాలనీలోని బంధువుల ఇంట్లో ఉంటుంది. కాగా బుధవారం రాత్రి 8గంటలకు ఇంటి నుంచి బయటకు ఆడుకుంటూ వెళ్లి తప్పిపోయింది. కొద్దిసేపటి తర్వాత పాప కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా జాడ తెలియలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీల ద్వారా జీడిమెట్ల డిపో వద్ద ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బాలికను వారి బంధువులకు అప్పగించారు. గంట వ్యవధిలో పాపను అప్పగించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తవ్వారు.. వదిలేశారు

“ డ్రైనేజీ నీటిని మళ్లించే పనుల కోసం గుంతలను తవ్వి వదిలేశారు. దీంతో అవి ప్రమాదకరంగా మారాయి. నెలలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పనుల క్రమంలో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ బండరాళ్లు, మట్టి పోసి వదిలేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ”



డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు



ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ పైపులైన్

- డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా గుంతలు
- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లోని తుర్క చెరువు ఎగువ ప్రాంతం నుంచి చెరువులోకి చేరే డ్రైనేజీ నీటిని రాజధాని స్కూల్ దగ్గర నాలాలోకి కలిసే విధంగా మే నెలలో పనులను ప్రారంభించారు. ప్రగతి నగర్‌లోని 2వ డివిజన్, ఆర్‌కే లే అవుట్ నుంచి సాయినగర్ మీదుగా ఆదిత్య గార్డెన్, రాజీవ్ గృహకల్ప, తుర్క చెరువు బయటి నుంచి రాజధాని స్కూల్ దిగువన నాలాలోకి కలిపే విధంగా ప్రణాళికలు రూపొందించారు. పనుల కోసం 900 డయా పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా కనీసం కిలో మీటరు మేర సైతం పనులు కూడా పూర్తి కాలేదు.

రోడ్డును తవ్వి వదిలేశారు

సాయినగర్‌లో పైపులైన్ కోసం రోడ్లను తవ్వి వదిలేశారు. మరమ్మతులు కూడా చేయక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పనులు నిలిచిపోయాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్లను తవ్వి పైపులైన్ పనులు పూర్తి చేసిన ప్రాంతంలో కూడా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. గుంతల మయంగా ఉన్న రోడ్డుపై వర్షాలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా



కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పూర్తి చేసిన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు.. విద్యుత్ స్తంభాలు

డ్రైనేజీ పనుల కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు గుంతల్లో పెద్ద మొత్తంలో వరద నీరు చేరి ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా తవ్విన గుంతల వద్ద విద్యుత్ స్తంభాలు ఉండటంతో వర్షాలతో ఎప్పుడు కూలుతాయోనని భయపడుతున్నారు. ఓ స్తంభాన్ని తాడు సహాయంతో కట్టివేశారు.

అధికారులు స్పందించడం లేదు



డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎన్ని సార్లు కోరిన ఫలితం లేదు. నెలల తరబడి ఇలా రోడ్లను తవ్వి వదిలేస్తే ఎలా?. ఎక్కడ బడితే అక్కడ రోడ్లపై రాళ్లు, మట్టి వేశారు. బిల్లులు రావడం లేదు, అందుకే పనులు ఆపేశాను అని కాంట్రాక్టర్ చెబుతున్నారు.

– రామనర్సయ్య, సాయినగర్

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం



వర్షాలు కురిసినప్పుడు వరద నీరు మొత్తం డ్రైనేజీ గుంతల్లో చేరుతుంది. నిండుగా ఉండటంతో చిన్న పిల్లలు తెలియక ఆడుకునేందుకు వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు అందులో పడితే ఎంత ప్రమాదం. అసలే ప్రతి రోజు వర్షాలు కురుస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందుగా చర్యలు తీసుకోవాలి. సకాలంలో పనులను పూర్తి చేయాలి

– కృష్ణ, సాయినగర్





పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

నిజాంపేట్: రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం నిజాంపేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆయన వెంట నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అటకెక్కిన సీసీ కెమెరాల నిర్వహణ



రంగారెడ్డినగర్: ప్రజల భద్రత కోసం ప్రధాన చౌరస్తాలు, బస్టాప్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ అటకెక్కింది. పలు చోట్ల సీసీ కెమెరాలు పని చేయక పోవడం, మరికొన్ని చోట్ల ఉన్నా నేల చూపులు చూస్తున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణను ఓ ప్రైవేట్ కంపెనీకి అప్పగించగా.. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వారు ఆడిందే ఆట.. పాడిందే ఆటగా మారుతోంది. చింతల్ ప్రధాన రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కనిపించకపోగా.. కేవలం పోల్ మాత్రం దర్శనమిస్తోంది. ఎవరైనా కెమెరాలను తస్కరించారా? లేక అధికారులే వాటిని తొలగించారా? అన్నది తెలియాల్సి ఉంది.

కంప్యూటర్లు అందజేత

జీడిమెట్ల: పోలీస్ స్టేషన్‌కు అత్యాధునిక కంప్యూటర్లను అందజేయడం అభినందనీయమని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. బుధవారం జీడిమెట్ల థర్మోకేబుల్స్ పరిశ్రమకు చెందిన టెక్నికల్ టీం హెడ్ ఇన్‌చార్జ్ శర్మ జీడిమెట్ల పీఎస్‌లో సీఐ మల్లేష్, డీఐ కనకయ్యకు అందజేశారు. కార్యక్రమంలో జీడిమెట్ల పోలీసులు, థర్మో కేబుల్స్ పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.



కంప్యూటర్లను అందజేస్తున్న థర్మో కేబుల్స్ టెక్నికల్ ఇన్‌చార్జి శర్మ

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

శామీర్‌పేట్: మత్స్యకారుల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్ అన్నారు. 100 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న 3.60 లక్షల చేపపిల్లలను బుధవారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పెద్దచెరువులో వదిలారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి వేరువేరుగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను గాలికి వదిలేశారని, ఆంధ్రా కాంట్రాక్టర్లకు మేలు చేశారని ఆరోపించారు. మత్స్యకారుల కుటుంబాల అభివృద్ధికై పంచవర్ష ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, జిల్లా చైర్మన్ మన్నె రాజు, హాజ్ కమిటీ సభ్యుడు ముజీబ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు శంకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చేప పిల్లలను వదులుతున్న రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్ తదితరులు

ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తూముకుంట అంబేద్కర్ విగ్రహం నుంచి మేడ్చల కలెక్టరేట్ వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేయాలని వారు కోరారు. ఏ ఉద్యోగ నియామకాలైన ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తరువాతనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రణయ్ మాదిగ, రాంచందర్, శంకర్, శివ, శేఖర్, నరేందర్, మహిళలు, అనుబంధ విభాగాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



షాపూర్‌నగర్ రంగ – భుజంగా థియేటర్ తిరుమల బేకరీ ముందు ఇటీవల ట్రాఫిక్ పోలీసులు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసే వాటిని తొలగించారు. అదే ప్రాంతంలో తిరిగి డబ్బాలు ఏర్పాటు చేసుకొని మార్కెట్‌కు వెళ్లే రోడ్డు మొత్తం జామ్ చేస్తున్నారు. పండుగ కావడంతో రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేయకుండా కట్టడి చేయాలని స్థానిక వ్యాపారులు, వాహనదారులు కోరుతున్నారు – కుత్బుల్లాపూర్



ఎస్ఆర్ నాయక్ నగర్‌లో సరస్వతీదేవిగా అమ్మవారు



పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మోదీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్స్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

నవరాత్రి ఉత్సవం.. భక్తుల సంతోషం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు హోమాలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చదువుల తల్లి సరస్వతీగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. –కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన పూజలో భక్తులు



దీపోచంపల్లిలో జరిగిన పూజలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్



చింతల్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

హోమంలో పాల్గొన్న భక్తులు



విద్యార్థి అదృశ్యం



సాక్షి, సిటీబ్యూరో: స్నేహితులతో కలిసి బయటకు వెళ్లిన ఓ విద్యార్థి తిరిగి ఇంటికి రాని సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ నరసింహారాజు వివరాల ప్రకారం సిక్కుబస్తీలో నివాసముండే బసంతి కౌర్ వద్ద ఆమె సోదరి కుమారుడు బీరు సింగ్ (14) ఉంటున్నాడు. 9వ తరగతి చదువుతున్న బీరు సింగ్ ఈ నెల 8వ తేదీన తన స్నేహితులతో కలసి సమీపంలోని గడ్డిచేను వద్ద ఆడుకుంటున్నాడు. అటువైపుగా వెళ్లిన బసంతి కౌర్ తొందరగా ఇంటికి రావాలని బీరు సింగ్‌కు చెప్పి ఇంటికి వెళ్లిపోయింది. సాయంత్రం బీర్ సింగ్ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె బీరు సింగ్ స్నేహితులను ఆరా తీసింది. తమకేమీ తెలియదని వారు చెప్పడంతో పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బీరు సింగ్ నీలిరంగు ప్యాంటు, నీలిరంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, హిందీ, పంజాబీ భాషలు మాత్రమే మాట్లాడతాడని పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా పుల్లయ్య

మూసాపేట: ఆర్యవైశ్య సంఘం కూకట్‌పల్లి మండల అధ్యక్షుడిగా దుద్దెల పుల్లయ్యను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూకట్‌పల్లి మండల సంఘం పెద్దలు చెరుకు కుమారస్వామి, ఉప్పల చంద్రశేఖర్, పూర్ణ చందర్, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు బిల్లకంటి శ్రీధర్, ప్రతినిధులు రాఘవేంద్ర, అరవింద్, వివిధ బస్తీల అధ్యక్షులు మందుమూల రాజు, బుస శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, మూసాపేట మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

